# EL-Shaddai Full Gospel Church

## IMMANUEL FOUNDATION (Regd.)

Ponnapuram Colony, Nandyal - 518501

IMMANUEL FOUNDATION INDIA

## శాప విముక్తి - ఆశీర్వాద ప్రార్థన - 03

భూమ్యాకాశములను సృజించిన సృష్టికర్తవైన మా దేవా!
నీ ఘనమైన శ్రేష్ఠమైన పరిశుద్ధమైన మహోన్నతమైన నామమునకు
స్తుతులు, స్తోత్రములు, వందనములు.

ప్రభువైన దేవా! మా తల్లిదండ్రుల నుండియు,
మా తల్లిదండ్రుల - తల్లిదండ్రుల నుండియు,
మా తల్లిదండ్రుల - తాతముత్తాతల నుండియు,
మా తల్లిదండ్రుల - అమ్మమ్మ జేజమ్మల నుండియు,
తండ్రి వంశం నుండి 4 తరములుగా వెంబడించుచున్న
శాపములన్నిటి నుండియు, దోషములన్నిటి నుండియు,

కన్నతల్లి వంశము నుండి 4 తరములుగా వెంబడించుచున్న
శాపములన్నిటి నుండియు, దోషములన్నిటి నుండియు
నజరేయుడైన యేసు నామములోనే
నేను విడుదలను పొందగోరుచున్నాను.
ప్రభువా! నన్ను కరుణించండి.

యేసయ్య! నీ రక్తముతో నన్ను కడగండి.
యేసయ్య! నీ రక్తముతో నన్ను శుద్ధీకరించండి.
యేసయ్య! నీ రక్తముతో నన్ను కడిగి పరిపూర్ణునిగా చేయండి.
యేసయ్య! తండ్రి చిత్తము నెరవేర్పు కొరకు, నీవిచ్చిన ఆజ్ఞ ప్రకారము
నీ పరిశుద్ధ నామములోనే
పరిశుద్ధ జీవితం జీవించాలని ఆశపడుచున్నాను;
కృప చూపించండి.

యేసయ్య! నీ సిలువ బలియాగము ద్వారా
నా పితరుల శాపము నుండి
నన్ను విడిపించండి.
దేవా! నా మీదను, నా కుటుంబము మీదను పనిచేయుచున్న
4 తరముల శాపమును కొట్టివేయండి.

యేసయ్య! నా కోసము 2 వేల సంవత్సరముల క్రితం
రక్తము కార్చి సిలువలో శాపగ్రహిగా వ్రేళాడావు.
ఇందునుబట్టి నీకు స్తుతులు, స్తోత్రములు.
నీ సిలువ శక్తినిబట్టి ఇప్పుడు నేను శాపము నుండి విడుదలను
పొందగోరుచున్నాను నన్ను కరుణించండి.

ప్రభువైన దేవా, యేసయ్య!
నిర్గమకాండం 20వ అధ్యాయం 4,5 వచనాలలో
పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని
భూమిక్రింద నీళ్లయందేగాని యుండు
దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు;
వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు.
ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషము గల దేవుడను;
నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు,
తండ్రుల దోషమును కుమారులమీదికి రప్పించెదను.
అని సెలవిచ్చిన దేవా! నా ద్వారాను, నా తల్లిదండ్రుల ద్వారాను,
నా పితరుల ద్వారాను - నా మీదను, నా కుటుంబము మీదను వున్నటువంటి
శాపము నుండియు, దోషముల నుండియు
యేసు నామములోనే నేను విడుదల పొందగోరుచున్నాను.

యేసయ్య, నన్ను పాపము నుండియు, శాపము నుండియు
దోషముల నుండియు విడిపించుటకు నీవు 2 వేల సంవత్సరముల క్రితం
నా దోషములనుబట్టి నలగగొట్టబడ్డావు.
నా కొరకు నీవు శిక్షననుభవించావు. నా కొరకు శ్రమనొంది బాధింపబడ్డావు.
యేసుదేవా! నాకోసమే కొరడా దెబ్బలు తిన్నావు.
వ్యసనక్రాంతుడిగ వ్యాధిననుభవించావు.
దేవా, యేసయ్య! నా కోసమే తృణీకరించబడ్డావు.
యేసయ్య! యెహోవా నిన్ను నలుగగొట్టుటకు ఇష్టపడగా
నీవు నా కోసము నలుగగొట్టబడి సిలువలో వ్రేలాయున్నావు.
అందునుబట్టి నీకు స్తోత్రములు.

తండ్రివైన దేవా, యెహోవా! నన్ను శాపము నుండి విడిపించడానికి
నీ ప్రియ కుమారుడైన యేసును
నా కొరకు శాపగ్రస్తుడిగా మ్రాను మీద వేళాడదీసియున్నావు.
ఇదంతయు నాకోసమే;
అందునుబట్టి నీకు స్తోత్రములు.

తండ్రివైన దేవా, యెహోవా!
నన్ను స్వస్థపరచుటకై నీ కుమారుడైన యేసునకు వ్యాధి
కలుగజేసియున్నావు; అందునుబట్టి నీకు స్తోత్రములు.
నా పాపములను కడిగివేయుటకు నీ కుమారుడైన యేసును
పాప పరిహారార్థ బలిగా స్వీకరించియున్నావు.
అందునుబట్టి నీకు స్తోత్రములు.
తండ్రివైన దేవా, యెహోవా! నీ కుమారుడును
మా ప్రియరక్షకుడైన యేసు నామములోనే
విగ్రహారాధన శాపమునుండియు,
దోషమునుండియు నాకు విముక్తిని ప్రసాదించండి.

సాతానా, నాతో నీకిక పనిలేదు.
విగ్రహములద్వారాను, దేవతా శక్తులద్వారాను,
నేను చేసుకొనిన మొక్కుబడుల నుండి
నేను విడుదల పొందుకుంటున్నాను.
నజరేయుడైన యేసు నామములోనే
దైవవిరోధ సంబంధమైన నా ప్రతిక్రియలను
నేను రద్దుపరచుకొనుచున్నాను.

నేను యేసు రక్తముతో కడగబడియున్నాను.
నేను యేసు రక్తము క్రింద వున్నాను.
నేను యేసు సిలువ చాటున నిలువబడియున్నాను.
నేను పరిశుద్ధాత్మని సహవాసములో వున్నాను.

సాతానా నన్ను వెంబడించవద్దు!
సాతానా, నీతో నాకున్న ప్రతి విధమయిన సంబంధమును
రద్దుచేసుకొనుచున్నాను.
నేను యేసయ్య బిడ్డను - నేను యేసయ్య బిడ్డను...

యేసయ్య! దయతో మా ప్రార్థన ఆలకించి
మా మీదనున్న దోషములను తరతరాల శాపమును కొట్టివేసి,
సంపూర్ణ ఆశీర్వాదములోనికి మమ్ములను నడిపించుమని
నీ నామములోనే ప్రార్థించి, స్తుతించి వేడుకొనుచున్నాము;
మా ప్రియ పరలోకపు తండ్రి. ఆమేన్. ఆమేన్.. ఆమేన్...

సమకూర్పు:
దైవజనులు డా.. ఇమ్మానుయేలు సన్నిధి, ఎల్నద్దాయి.